క్లుప్తంగా

వైభవంగా జలధి ఉత్సవం



రంగనాథస్వామి జలది ఉత్సవానికి ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

రొళ్ల: మండలంలోని రొళ్లకొండ గ్రామంలో వెలసిన రంగనాథస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం జలధి ఉత్సవాన్ని కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారి మూల విగ్రహానికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించి మూడు కిలోమీటర్ల దూరంలో కొడగార్లగుట్ట గ్రామ సమీపాన ఉన్న నాయకనకట్ట వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. చెరువులో ఉత్సవ విగ్రహాన్ని పట్టం కూర్చోబెట్టారు. తర్వాత ఉత్సవ విగ్రహాలను శుద్ధి చేసి అభిషేకించారు. ఆలయ ప్రధాన అర్చకులు మహామంగళారతి చేసి భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వేడుకలకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు గ్రామానికి చెంది ఉండి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన



విద్యానిధి కాలేజీలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు హసీనా సుల్తానా

పరిగి: కాలువపల్లి వద్ద ఉన్న విద్యానిధి జూనియర్ కాలేజీలో నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దారు హసీనా సుల్తానా గురువారం పరిశీలించారు. పరీక్ష నిర్వహణకు ఉన్న వసతులు, తరగతి గదులను పరిశీలించారు. హాజరయ్యే విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక వసతులపై ప్రిన్సిపల్ ఎల్లారెడ్డితో ఆరా తీశారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, గాలి వెలుతురు, మరుగుదొడ్డి తదితర సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ సిద్దేశ్వర్, వీఆర్వో కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లి తండాలో నవోదయంపై అవగాహన



శెట్టిపల్లి తండాలో మాట్లాడుతున్న సీఐ సృజన్ బాబు

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లి తండాలో ఎక్సైజ్ అధికారులు నవోదయం కార్యక్రమంపై గురువారం అవగాహన కల్పించారు. సీఐ సృజన్‌బాబు నాటు సారాతో అనర్థాలపై తండావాసులకు తెలియజేశారు. నాటు సారా విక్రయించినా, తయారు చేసినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రోత్సాహక బహుమతుల అందజేత

హిందూపురం అర్బన్: గతేడాది పట్టణంలో వినాయక నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన వారికి గురువారం డీఎస్పీ కేవీ మహేష్ పోత్రాహక బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా డీబీ కాలనీకి చెందిన వల్లభవినాయక సేవా సమితికి రూ.15 వేలు, కోట ప్రాంతానికి చెందిన విశ్వవినాయక సేవా సమితికి రూ.12 వేలు, డీఆర్ కాలనీలో రాష్ట్రీయ వినాయక సేవాసమితికి రూ.10 వేలు, ఆర్టీసీ కాలనీకి చెందిన గరుడ వినాయక సేవాసమితికి రూ.8 వేలు, హస్నాబాద్‌కు చెందిన శ్రీ సిద్ధి వినాయక సేవాసమితికి రూ.5వేల చొప్పున నగదు అందించారు. లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయ చైర్మన్ రమానందన్ సహకారంతో పోత్సాహక బహుమతులు అందించామని డీఎస్పీ తెలిపారు. ఏటా ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకొనేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ఆదరణ లేక బతుకు బొమ్మలాట

- దయనీయంగా కళాకారుల జీవితం
- కనుమరుగయ్యే స్థితిలో కళ

లేపాక్షి: తోలుబొమ్మలాట ఆదరణకు నోచుకోవడం లేదు. సినిమాలు, టీవీలు, మొబైల్ ఫోన్ల యుగంలో ఆ కళను పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రజాదరణ లేకపోవడంతో ఆ కళను నమ్ముకున్న కళాకారుల జీవితాలు దయనీయంగా మారాయి. వివరాల్లోకెళితే.. తోలుబొమ్మలాట వృత్తిగా చేసుకున్న సుమారు 8 కుటుంబాల వారు లేపాక్షిలో నివాసం ఉంటున్నారు. వీరు ఆర్యకటిక కులానికి చెందిన వారు. వీరి పూర్వీకులు కూడా ఈ వృత్తినే నమ్ముకుని జీవనం సాగించారు. అయితే సినిమాలు, డ్రామాలు రావడం, దీనికి తోడు సినిమాలు, మొబైల్ ఫోన్లు రావడంతో తోలుబొమ్మలాటను చూసే వారు కరువయ్యారు. సినిమాలు, డ్రామాలు లేని కాలంలో ప్రతి గ్రామంలో తోలుబొమ్మలాటను ఒక వినోద ఆటగా చూసే వారని తోలుబొమ్మలాట వృత్తికారులు చెబుతున్నారు. ఎంతో విశిష్టత ఉన్న కళకు ఆదరణ లేకపోవడంతో వృత్తి కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళ్లకు కట్టేలా..

తోలుబొమ్మలాటలో రామాయణంలోని సుందరకాండ, సతీసులోచన, మహిరావణచరిత్ర, అంగద రాయబారం లాంటి సన్నివేశాలను వీరు కళ్లకు కట్టినట్లు ప్రదర్శిస్తారు. ఈ తోలుబొమ్మలాట హైదరాబాద్, ఢిల్లీ ఎగ్జిబిషన్‌లో కూడా ప్రదర్శనకు ఉంచారు. తోలుబొమ్మలను మేక చర్మంతో తయారు చేస్తారు. మేక చర్మం తెచ్చి వాటిని శుభ్రం చేసి రంగులతో బొమ్మలను తయారు చేస్తారు. ఎక్కువ కాలం ఉండేలా బొమ్మలకు క్యామిల్ రంగును పూస్తారు. జత బొమ్మలను తయారు చేయడానికి రూ. 6 నుంచి రూ.7 వేలు ఖర్చు చేస్తారు. తోలుబొమ్మలాట ప్రదర్శనకు ఏడుగురు కావాల్సి ఉంటుంది. వీరితోపాటు హార్మోనియం, మద్దిలి, మైక్‌సెట్ కళాకారులు ఉంటారు. గతంలో తోలుబొమ్మలాటను ప్రదర్శిస్తే కొంత మంది పెద్దలు కొంత సాయం చేసేవారని, ఇంకొంత తిరిగి సంపాదించుకునేవారమని కళాకారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పరిస్థితిల్లో తోలుబొమ్మలాట ప్రదర్శన బరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తోలుబొమ్మలాటను ప్రభుత్వమే ప్రోత్సాహించి కళాకారులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



తోలుబొమ్మలతో చేసిన మండోదరి, సీత, తారా బొమ్మలు



రాముడు, సీత, లక్ష్మణుడు

ప్రభుత్వమే ప్రోత్సాహించాలి



లేపాక్షి నంది ఉత్సవాలను నాలుగుసార్లు ప్రభుత్వమే నిర్వహించింది. అయితే ఎక్కడో కోస్తా ప్రాంతంలోని తోలుబొమ్మలాట కళాకారులను పిలుపిస్తున్నారే గాని లేపాక్షిలోనే 35 ఏళ్లుగా తాము ఉన్న మాకు అవకాశం ఇవ్వలేదు. తోలుబొమ్మలాట వృత్తిని నమ్ముకుని జీవనం చేస్తున్నాం. ప్రభుత్వం తమను గుర్తించి ప్రోత్సాహించాలి. – గోపాలప్ప, తోలుబొమ్మలాట కళాకారుడు

వృత్తినే నమ్ముకున్నాం



30 ఏళ్ల క్రితం మా పెద్దవారు తోలుబొమ్మలాటను ప్రదర్శించడానికి ఇక్కడికి వచ్చాం. మా సొంత గ్రామం ఏదో తెలియని పరిస్థితి. మాకు వృత్తితో పాటు ఇల్లు తప్ప ఏ ఆధారం లేదు. మా పిల్లలను కూడా ఈ వృత్తిని నమ్ముకుని చదివించలేక పోయాం. ఈ వృత్తికి ఆదరణ తగ్గుతోంది. తోలుబొమ్మలాట వృత్తిని బతికించాలి. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. – విమలమ్మ, తోలుబొమ్మలాట కళాకారిణి

వైభవంగా శివరాత్రి వేడుకలు







మడకశిర: చంద్రమౌళేశ్వరస్వామికి నగరోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం, పావగడ: ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, శివ తాండవం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మడకశిర: పట్టణంలో శుక్రవారం కూడా మహాశివ రాత్రి వేడుకలు నిర్వహించారు. శివాలయాల్లో మూల విరాట్‌లు వివిధ ఆకరాల్లో దర్శనమిచ్చాయి. చంద్రమౌళేశ్వరస్వామికి ఈసందర్భంగా భక్తిశ్రద్ధలతో నగరోత్సవం చేశారు. భోగి రామేశ్వర స్వామి, దత్త బాణలింగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఉపవాస దీక్షలను విరమించారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి పట్టణంలోని వాసవీ మహల్, చంద్రమౌళేశ్వరస్వామి ఆలయాల్లో నిర్వహించిన శివరాత్రి వేడుకల్లో పాల్గొన్నారు. జ్యోతిర్లింగాన్ని దర్శించుకుని గిరిజా కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా ప్రజలు గురువారం మహాశివరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బూదిలి కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో వీర శైవ సేవ సంఘం ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది. ప్రత్యేక హోమాలు నిర్వహించి, గంగపూజ అనంతరం శివ పార్వతుల కల్యాణోత్సం జరిపించారు. బస్టాండ్ సమీపంలోని పురాతన శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం జరిపించారు.

పావగడ: తాలూకాలోని కామనదుర్గం (కామిలి కొండ) కొండపై వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు భజనలు చేస్తూ రాత్రి ఆలయం వద్ద జాగరణ నిర్వహించారు. గురువారం ఉదయం ఉపవాస దీక్ష విరమించిన భక్తులు ఆలయ అభివృద్ధి సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకుడు శివకుమార్, అనంతపురం, హిందూపురం, లేపాక్షి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కంబదూరు తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

అలరించిన శివ తాండవం

పావగడ: శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని స్థానిక సేవా ట్రస్ట్, శమీ వృక్ష ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన విద్యార్థుల నృత్య ప్రదర్శన, శివ పార్వతుల వేషధారణ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్థానిక ఎస్ఎస్‌కే రంగమందిరంలో బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలోని 20 పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మానం వెంకటస్వామి, డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ టీ ఎస్ నరసింహయ్య, వి.నాగభూషణ రెడ్డి, హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్, శమీ వృక్ష ట్రస్ట్ కార్యదర్శి సత్య లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మోడల్'లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అమరాపురం: మండలంలోని హలుకూరు గ్రామ సమీపంలో వున్న మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబలపతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025 -26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్ నిబంధనల ఆదారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. అర్హత కలిగిన వారు మార్చి 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 ప్రవేశ పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పౌరహక్కుల దినోత్సవం

పరిగి: మండలంలోని శాసనకోటలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలో తహసీల్దారు హసీనా సుల్తానా ఆధ్వర్యంలో పౌరహక్కులు, విధులు, ఎస్సీ, ఎస్టీ చట్టాలతో పాటు మహిళలు, బాలబాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రంగడుయాదవ్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వీరనారాయణ, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు రామాంజి, వీఆర్వో మద్దిలేటి పాల్గొన్నారు.

అగ్నిగుండ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

అమరాపురం: మండలంలోని హేమావతిలో వెలసిన సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించే అగ్నిగుండ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ నరసింహరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ఆవరణలో బారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఆర్టీసీ హిందూపురం, మడకశిర డిపో వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో తాగునీటి వసతి కల్పించారు.

ప్రత్యేక నిఘా ఉంచండి: సీఐ

అగ్నిగుండ మహోత్సవాల్లో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. ఆలయ ఆవరణలో గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ హేమావతి చుట్టుపక్కల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామన్నారు. పోలీసులు నాలుగు కూడళ్లలో అనుమతి లేని వాహనాలను లోపలికి వదలరాదన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ.ఇషాక్‌బాషా, పోలీసులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ రాజ్‌కుమార్

ఘనంగా చంద్రమౌళేశ్వరస్వామి రథోత్సవం

హిందూపురం: చౌళూరు గ్రామంలో చంద్రమౌళేశ్వరస్వామి రథోత్సవం గురువారం ఘనంగా జరిగింది. పార్వతి పరమేశ్వరులను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం రథాన్ని విశేష అలంకరించి వేదపండితులు రథాంగ హోమం నిర్వహించారు. అనంతరం పార్వతి,చంద్రమౌళేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో పల్లకీలో తీసుకుని వచ్చి రథంలో కొలువుదీర్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నేత చౌళూరు మధుమతిరెడ్డి, ఎంపీపీ రత్నమ్మ, సర్పంచ్ నంజప్పతోపాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు. సీఐ ఆంజనేయులు ఆధ్వరంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

పోసాని కృష్ణమురళి అరెస్ట్ దుర్మార్గం

మడకశిర: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అక్రమ అరెస్టులతో వేధింపులకు గురి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన మడకశిరలో విలేకారుల సమావేశంలో మాట్లాడుతూ సినీ నటుడు పోసాని కృష్ణ మురళి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. న్యాయస్థానం అనేకమార్లు బీఎన్ఎస్ 111 సెక్షన్లు వర్తించవని పేర్కొన్నప్పటికీ అవే సెక్షన్లతో అక్రమ కేసులు నమోదు చేసి ప్రతిపక్ష పార్టీల నాయకులు, కళాకారులను వేధిస్తూ న్యాయ వ్యవస్థ వ్యాఖ్యలను పట్టించుకోవడం లేదన్నారు. పోసాని రాజకీయాలకు దూరంగా ఉంటున్నానని ప్రకటించినా వేధిస్తున్నారన్నారు.

ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం

గుడిబండ: గుడిబండ మండలంలో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. కర్ణాటక సరిహద్దు మండలం కావడంతో గుడిబండ చుట్టూ మూడు కిలోమీటర్ల దూరంలో కర్ణాటక మద్యం షాపులు ఉన్నాయి. జంబులబండ గ్రామానికి కర్ణాటక ప్రాంతం కొత్తూరు, ఎస్.రాయాపురం గ్రామ పంచాయతీకి సమీపంలో కర్ణాటక చంద్రబావి గ్రామాలు ఉన్నాయి. మోరుబాగల్ గ్రామానికి సమీపంలో హరేగెరె గ్రామం ఉన్నాయి. ఇలా ప్రతి పంచాయతీకి కర్ణాటక ప్రాంతాన్ని అనుకుని మరో గ్రామం ఉండడం వల్ల అక్కడ కర్ణాటక మద్యం షాపులు ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో కొన్ని మద్యం షాపులు బడా నేతల అండదండలతో అక్కడి నుంచి కొంత మంది ప్రత్యేక వాహనాల్లో గుడిబండ మండల సరిహద్దు గ్రామాలకు మద్యాన్ని చేరవేస్తున్నారు. మద్యం ప్రియులకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. చాలా గ్రామాల్లో కర్ణాటక మద్యం అమ్మకాలు విపరీతంగా సాగుతున్నాయి. పోలీసులు దాడులు చేస్తున్నా మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేయలేకపోతున్నారు.

ఇబ్రహీం బాబా ఆశ్రమంలో పూజలు

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఇబ్రహీం బాబా ఆశ్రమంలో శివరాత్రి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమంలోని శివుడి విగ్రహానికి మహా మంగళహారతి ఇచ్చి పూజలు చేశారు. తెల్లవారుజామున హోమంతోపాటు భజన జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏజీసీ భాస్కర్‌రెడ్డి, గ్రామ పెద్దలు తిమ్మారెడ్డి, వీపీ చంద్రశేఖర్ రామాంజనేయులు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక కోట వీధిలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణోత్సవం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అశ్వర్థనారాయణ శాస్త్రి, భాస్కర్‌శాస్త్రి, హరినాథ్ తదితరులు శివ పార్వతుల చిత్రపటంతో పాటు విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివ పార్వతులకు వేద మంత్రోచ్చారణాల మధ్య వివాహం జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చి శివ పార్వతుల విగ్రహాలపై పాలు, అక్షింతలు వేసి మొక్కులు చెల్లించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా విజయ్‌బాబు



హిందూపురం టౌన్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన డాక్టర్ భూపాలం విజయ్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఐడీఏ రాష్ట్ర కార్యదర్శి అజయ్ బెనర్జీ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన డాక్టర్ రాఘవేంద్ర, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ నవీన్, కోశాధికారిగా కదిరికి చెందిన డాక్టర్ బాబాఫకృద్దీన్, ఉపాధ్యక్షులుగా ధర్మవరం డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప, పుట్టపర్తి డాక్టర్ కృష్ణ సుమన్‌తో పాటు ఈసీ సభ్యులను నియమించారు. మహిళా దంత మండలి చైర్‌పర్సన్‌గా హిందూపురం డాక్టర్ సురేఖా దేవీ, కో చైర్‌పర్సన్ 1గా హిందూపురం డాక్టర్ భార్గవి, కో చైర్‌పర్సన్ 2గా పెనుకొండ డాక్టర్ చందన రోహిల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విజయ్ బాబు మాట్లాడుతూ తమ బృందం నోటి వైద్యాన్ని ప్రోత్సహించడానికి నిరంతరం దంత విద్య కార్యక్రమాలు, వర్క్ షాపులు, కమ్యూనిటీ ఔట్రీచ్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

రెండు కార్లు ఢీ

గుడిబండ: మండలంలోని మడకశిర-అమరాపురం వెళ్లే ప్రధాన రహదారిలో కేకాతి గ్రామం వద్ద గురువారం సాయంత్రం రెండు కార్లు ఢీకొన్నాయి. వివరాలు. మడకశిర నుంచి అమరాపురం వెళ్లే కారు, అమరాపురం నుంచి మడకశిర వైపు వస్తున్న మరో కారు కేకాతి గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రెండు కార్లు ఢీకొన్నాయి. ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రెండు కార్లు ముందు భాగం దెబ్బ తిన్నాయి. కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరికి గాయాలు

మడకశిరరూరల్: మండలంలోని ఆమిదాలగొంది గ్రామం వద్ద గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంటనే వారికి మడకశిర ఆస్పత్రికి తరలించి చికిత్సలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఎం.నగేష్, ఎన్. నగేష్ ద్విచక్రవాహనాల్లో పావగడ వైపు వెళ్తుండగా ఆమిదాలగొంది వద్ద ప్రమాదం చోటుచేసుకుంది.

డెయిరీ తనిఖీ

సోమందేపల్లి: మండలంలోని చాకర్లపల్లి సమీపంలోని దొడ్ల డెయిరీని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ తస్లీం గురువారం తనిఖీ చేశారు. డెయిరీలో నిల్వ ఉన్న పాల శ్యాంపుల్‌ను ఆమె సేకరించారు. స్టోరేజ్ ట్యాంక్‌తో పాటు డెయిరీ పరిసరాలు పరిశీలించారు. నాణ్యత శుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. సేకరించిన పాలను ల్యాబ్‌కు పంపుతామని తెలిపారు.

ఘనంగా 'మదరసా' వార్షికోత్సవం

పావగడ: స్థానిక జామియా మసీదులో నిర్వహిస్తున్న అరబ్బీ మదరసా పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన ఖురాన్ పఠనం, వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ముతవల్లి లతీఫ్ సాబ్, అధ్యక్షుడు రియాజ్, కార్యదర్శి మహ్మద్ జావీద్, ఉపాధ్యక్షుడు గౌసుద్దీన్ సాబ్, కౌన్సిలర్ మహ్మద్ ఇమ్రాన్, ఆర్‌టీ ఖాన్, షాబాబు, రిజ్వాన్ ఉల్లా, సాధిక్, ఉపాధ్యాయుడు ముబారక్ అహ్మద్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రొద్దం: పాతర్లపల్లికి చెందిన శివకుమార్ కనిపించ లేదని అతని తండ్రి సుబ్బరాయుడు గురువారం ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కాంతప్ప తెలిపారు. ఈనెల 23న తెల్లవారుజామున గ్రూప్-2 పరీక్షలు రాయడానికి ఇంటి నుంచి అనంతపురం వెళ్లినట్లు తెలిపాడు. అప్పటి నుంచి తిరిగిరాలేదని, బంధువులు, స్నేహితుల ఊర్లలో వెతికినా ఆచూకీ కనిపించలేదని తెలిపాడు.



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

వైభవంగా వీరభద్రస్వామి బ్రహ్మరథోత్సవం







రథం ముందు ఆలయ చైర్మన్ రమానందన్ తదితరులు, స్వామి వారిని పల్లకీలో తీసుకొస్తున్న దృశ్యం, భక్తులకు భోజనం వడ్డిస్తున్న వేణురెడ్డి

లేపాక్షి: లేపాక్షిలో వీరభద్రస్వామి బ్రహ్మరథోత్సవం గురువారం అత్యంత వైభవంగా సాగింది. వేలాది మంది భక్తులు శివనామస్మరణతో లేపాక్షి మార్మోగింది. బస్టాండు నుంచి ఎగువపేట రామమందిరం వరకు రథోత్సవం శోభాయానంగా కొనసాగింది. ముందుగా శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ఈఓ నరసింహమూర్తి పర్యవేక్షణలో ఆగమికులు సునీల్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు హోమాలను నిర్వహించారు. అనంతరం స్వామికి మహామంగళరాతి ఇచ్చి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి బ్రహ్మరథోత్సవం వరకు బ్రాహ్మణులు పల్లకీలో తీసుకొచ్చారు. రథంలో శివపార్వతులను కూర్చోపెట్టి పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. సాయంత్రం ధూళోత్సవం నిర్వహించారు. సర్పంచ్ ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యులు జైకిసాన్, లీలావతమ్మ, వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ నేత వేణురెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, మండల కన్వీనర్ నిస్సార్ అహమ్మద్, కోప్షన్ సభ్యులు బషీర్, కౌన్సిలర్లు రామచంద్ర, నాగరాజు, మహేష్‌గౌడ్, నాయకులు చలపతి, మల్లన్న, రవి, శ్రీనివాసరెడ్డి, అంజినరెడ్డి, బాస్కర్‌రెడ్డి, తిప్పన్న, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా అన్నదాన కార్యక్రమాలు..

వీరభద్రస్వామి బ్రహ్మరథోత్సవం సందర్భంగా అన్నదానం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నిస్సార్ అహమ్మద్, మైనార్టీ నేత ఇర్ఫాన్ ఆధ్వర్యంలో మజ్జిగ, అన్నదానం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ నేత వేణురెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎగువ పేటలో బసవరాజు వారి మిత్రు మండలి వారు, మల్లన్నగారి వెంకటేష్, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చలపతి, ఎంపీటీసీ సభ్యుడు జైకిసాన్, ఆలయం ముందు ముద్దిరెడ్డిపల్లికి చెందిన జగదీష్ మిత్రమండలి వారు, బ్రాహ్మణ, ఆర్యవైశ్య సేవా సంఘం వారు, గరుడ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.